# మేడ్‌ఫర్ ...

"పెళ్ళంటే నూరేళ్ళ పంట ..... 'పెళ్ళిళ్లు స్వర్గంలో జరుగుతాయి .....' అంటూ ఔట్‌డేటెడ్ సూక్తులు చెప్పకు. కాలంతోపాటు మనమూ మారాలి మామయ్యా !" చురుగ్గా, ఒకింత నిర్లక్ష్యంగా అన్నాడు అనిరుధ్.


అనిరుధ్ మాటలకు విస్తుపోయాడు రత్నాకరం. 'సూక్తి' అంటే మంచిమాట. దానికి దేశ, కాలమానాల భేదం వర్తించదు. ఈ కాలం పిల్లలింత విపరీతంగా ఆలోచిస్తున్నారెందుకో? 'అనిరుధ్ ఈ మధ్య అదోలా ప్రవర్తిస్తున్నాడురా. స్త్రీల పట్ల వాని ఆలోచనలు విపరీతంగా అనిపిస్తున్నాయి. వాణ్ణి చక్కదిద్దడం నీ కూతురుకే సాధ్యం. ఒక్కసారి నువ్వు హైదరాబాదుకు రా!' అంటూ అక్క పిలవడం వెనక ఉన్న ఆవేదన ఇప్పుడు స్పష్టంగా గ్రహించ గలుగు తున్నాడతను. అనిరుధ్ అంతరంగం చిక్కడూ - దొరకడులా ఉంది.

"మేనరికాల గురించి నీ అభిప్రాయం తెలుసుకోవాలని" ? జంకుతూనే అడిగాడు.

"అంటే ...... నీ కూతుర్ని నాకు కట్టబెట్టాలనుకుంటున్నావా ? ఇదే మీతో వచ్చిన చిక్కు 'అనూషను చేసుకోవడం నీకిష్టమేనా' ?అని అడగొచ్చుగా ! అడగరు. ఎందుకు అనవసరంగా టైం తినేస్తారు" ?

అనిరుధ్ మాట తీరు మరోసారి రత్నాకరాన్ని కలవరపరిచింది. అతనేదో అనబోయేంతలో అనిరుద్దే అందుకున్నాడు మళ్ళీ -

"చూడు మావయ్యా ! అనూష పట్ల నాకు వ్యతిరేకత లేదు. అలాగే దాన్నే పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచనా లేదు. నాకు అనుషా అయినా మనీషా కోయిరాలా అయినా ఒక్కటే.



ఏదో .... ముక్కూ మొహం చక్కగా ఉండి, ఆడదై ఉంటే చాలు ......."

ఉలిక్కిపడ్డాడు రత్నాకరం. 'ఇదేంటి ? వీడి ఆలోచనలింత భయంకరంగా ఉన్నాయి? వీడ్ని దారిలోకి తేవడం అనూషకే సాధ్యం. నెలకు ఇరవైవేలు సంపాదించే ఈ ముప్ఫైదాటని యువకుడు స్త్రీల పట్ల ఇంతటి ప్రతికూలపు టాలోచనల్లో కూరుకుపోవడానికి కారణం ......?' ఆలోచిస్తూనే సర్దిచెప్పబోయాడు.

"అదికాదు, అనిరుధ్ ! కొంచెం ఓపికగా నామాట విను. భార్యంటే ...."

"సినిమా డైలాగులొద్దు" ! ఠక్కున అడ్డుకున్నాడు అనిరుధ్.

"భార్యంటే వైఫ్. లైఫ్ పార్టనర్ ..... సహధర్మచారిణి .... ఎట్సెట్రా.... ఎట్సెట్రా ... అంతేకదా !"

ఇంక అతనితో మాట్లాడటం కంటే మానేయడమే మేలనిపించింది రత్నాకరానికి. అక్కయ్యకు తన నిస్సహాయతను చెప్పేసి, 'తన భార్య బతికి ఉంటే వాళ్ళన్నయ్యతో గాకున్నా, వదినెతో పోరాడి ఈ మొండి ఘటం మేనల్లుడిని అల్లుడిని చేసుకునేదేనేమో. తనకంత చనువులేదు మరి .......'అనుకుంటూ తిరుగు ప్రయాణమయ్యాడు.

* * *

'మన సి.యం. ఎన్ని 'బాటలు' చేపట్టినా ఈ పల్లెటూళ్ళు మారవు' కొడవటూరులో అడుగుపెడ్తూనే అనుకున్నాడు.

తల్లి బలవంతం మీద బయలుదేరాడు గానీ, అక్కడికి రావడం అతనికేమాత్రం ఇష్టం లేదు. 'తల్లిలేని పిల్లరా ! చిన్నప్పటి నుండీ నువ్వంటే దానికి వల్లమాలిన అభిమానం. నీకు కావలసిన లక్షణాలన్నీ దానిలో ఉన్నప్పుడు చేసుకోవడానికి అభ్యంతరమెందుకు ? కనీసం నా తృప్తికోసమైనా వెళ్ళి చూసిరారా ! అసలే మీ మావయ్య చిన్నబుచ్చుకొని వెళ్ళాడు. అది స్వయానా నీ మేనత్త కూతురాయె ....' తల్లి మాటలు గుర్తొచ్చాయి మళ్ళీ.

ఎప్పుడో పదేళ్ళ క్రితం అత్తయ్య చనిపోయినప్పుడు వచ్చాడక్కడికి. ఇల్లు వెతుక్కోవడానికి పెద్దగా కష్టపడనవసరం లేకపోయింది.

గుమ్మంలోనే ఎదురైన అనూషను చూడగానే గుండె ఒక్కక్షణమాగి, మళ్ళీ కొట్టుకోవడం మొదలెట్టింది. 'అసలు ఈ ముద్దుగుమ్మ - నా మరదలు అనూషేనా ?' అనుకుంటూ మళ్ళీ చూశాడు - పరిశీలనగా ....

చారెడేసి కళ్ళు ..... మిసిమి బుగ్గలు ... ఎర్రని పెదాలు ... సృష్టికర్త చాలా శ్రద్ధగా తీర్చిదిద్దినట్లున్నది ...' అప్పుడే యాభైమార్కులు కొట్టేసిందే ? అనుకున్నాడు పనిలో పనిగా.

హఠాత్తుగా ఊడిపడ్డ అనిరుధ్‌ను చూసి కంగారు పడిపోయాడు రత్నాకరం. అనూష కూడా హడావుడి పడిపోయింది.

ఎప్పుడూ వాగుడుకాయలా లొడలొడలాడే అనిరుధ్ అక్కడ మాటలే దొరకనట్టు మౌనముద్ర వహించాడు. అనూషలో అతని రాక ఆనందాన్ని నింపిందని తెలుస్తూనే ఉంది. కాని, అతనూహించినంత గొప్పగా మాత్రం కాదు.

హఠాత్తుగా చూసి మొదట కంగారుపడ్డా, వెంటనే తేరుకుంది. చాలా కాజువల్‌గా ఒక స్నేహితుడ్ని ఆదరిస్తున్నట్టే అతడ్ని ఆదరించసాగింది. సిగ్గుతో లుంగలు చుట్టుకు పోవడం, బుగ్గలు ఎరుపెక్కడం, నేలమీద బొటనవేలితో రాస్తూ అరగంటకో మాట మాట్లాడటం లాంటివి లేవు. పైగా చాలా చురుగ్గా పనులన్నీ చక్కబెడుతూ మధ్య మధ్య అనిరుధ్‌ను పలకరిస్తూ ఉంది. ఆ పలకరింపూ ఏదో ఉబుసుపోక అడిగినట్టు రొటీన్ ప్రశ్నలు గాకుండా విజ్ఞానం, సాహిత్యం, వ్యక్తిత్వానికి సంబంధించినవి.

'పర్లేదే ! మరో ఇరవై అయిదు మార్కులెయ్యొచ్చు ...'అనుకున్నాడు అనిరుధ్ - ఆమెతో మాటలు కలుపుతూనే.

"అనూ ! ఈ రోజుకి బడికెళ్ళకుండా ఇంటికాడే ఉండమ్మా ! బావొక్కడే బోరైపోతాడు. వరికి మందు గొట్టించే పనిలేకపోతే నే నుండిపోదును గానీ ..." పొలానికి బయల్దేరేందుకు సిద్ధమవుతూ కూతురుతో అన్నాడు రత్నాకరం.

"అదెలా కుదురుతుంది నాన్నా? పిల్లలకు వారంరోజుల్లో పరీక్షలు. తప్పక వెళ్ళాలి. అప్పటికీ కొంచెం ఆలస్యంగా వస్తానని హెచ్.ఎం. గారికి చెప్పిపంపాను...." వీలుకాదని చెప్పకనే చెప్పింది అనూష.

"పర్లేదు మామయ్యా ! నేనుండగలనులే !" తండ్రీ కూతుళ్ళ సంభాషణ నడ్డుకున్నాడు అనిరుధ్. "అయినా నేనేం కొత్త చుట్టాన్నా ? మరీ అంతగా బోర్ అనిపిస్తే. నేనే పొలంవైపుకి వస్తా ..." అనూషని ఇబ్బంది పెట్టడం సబబనిపించలేదు.

"థాంక్స్ ! బావా ! నన్నర్థం చేసుకున్నందుకు. నువ్వు త్వరగా టిఫిన్ చేస్తే, నేను బడికెళ్తాను ..." నిర్మొహమాటంగా అడిగింది.

జొన్నరొట్టెల 'టిఫిన్' రుచి అతనికి బాగా నచ్చింది .... 'మరో పాతికమార్కులు వేయించుకుందే' ?అనుకున్నాడు.

డిగ్రీ పూర్తిచేసిన అనూష స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వాలంటరీ టీచర్‌గా పనిచేస్తోంది. అది ఆమెకు ప్రాణప్రదమైన ప్ర'వృత్తి'.

అనూష బడికెళ్ళాక కాలక్షేపం కోసం కాసేపు టీ.వీ. చూశాడు. 'ఏ ఛానల్ చూసినా ఒకే రకమైన ప్రోగ్రాములు - పేర్లు మాత్రం మార్పు ...' విసుగొచ్చి, అది ఆఫ్ చేసేసి, అనూష గది పరిశీలించసాగాడు. ఆమె లైబ్రరీ అతడ్ని బాగా ఆకర్షించింది. పుస్తకాలన్నీ

అంశాలవారీగా, ప్రక్రియల ననుసరించి, ఎత్తుననుసరించి - మంచి పద్ధతి ప్రకారం అమర్చుకుంది. పాత పుస్తకాలకు బైండ్లు చేయించి, లేబులింగ్ చేసుకొని మరీ పెట్టింది. ఈ గ్రంథాలయం ఆమె ఎంత అపురూపంగా చూసుకుంటూందో ఒక్క చూపులోనే తెలిసి పోయింది అనిరుధ్‌కి... 'మరో ఇరవైఅయిదు మార్కులు పడిపోయాయి' ... అనుకుంటూ ఎప్పటినుంచో తను చదవాలనుకుంటున్న విశ్వనాథ 'వేయిపడగలు' చేతిలోకి తీసుకున్నాడు ...

మధ్యాహ్నం భోజనం వేళకు వచ్చి, వేడి వేడి అన్నం, చారూ సిద్ధం చేసి, వడియాలు వేపింది. ఇద్దరూ మాట్లాడుకుంటూ తిన్నారు.

సాయంత్రం అనూష బడి నుండివచ్చాక కమ్మని కాఫీ తయారుచేసి ఇచ్చింది. ఇద్దరూ డాబా మీద కూర్చొని కబుర్లు చెప్పుకోవడంలో మునిగి పోయారు.

చీకటి పడుతూండగా రత్నాకరం వచ్చాడు. అతను రాగానే తను వెళ్ళాలంటూ హడావుడి ప్రదర్శించాడు అనిరుధ్.

"చలికాలం ... రాత్రి ప్రయాణం అంత మంచిది కాదు. పొద్దున్నే వెళ్ళొచ్చుగా బావా!" బతిమాలుతున్నట్టు అంది అనూష.

మరదలితో అలా అడిగించుకునేందుకే హడావుడి నటించిన అనిరుధ్ - 'సరేలే ! నీకోసం ... ఉండిపోతా ...'నన్నట్టు ఉండిపోయాడు.

'తొందరగా పడుకోవటం - తొందరగా నిద్రలేవడం' సిద్ధాంతమైన ఆ ఇంట్లో తనూ త్వరగానే నిద్రకుపక్రమించక తప్పలేదు అనిరుధ్‌కి. వసారాలో రత్నాకరం, వేర్వేరు గదుల్లో అనూషా, అతనూ పడుకొన్నారు. నిద్రపట్టని అనిరుధ్ ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

'వెంకటాపురంలో ఉండే స్నేహితుడు సద్యోజాతం గుర్తుకొచ్చాడు ముందు. చిన్నవయసులోనే అతనికి పెళ్ళైంది. పెళ్ళాం ప్రసూనాంబ అంత అందగత్తేం కాదు. కాని, ప్రతిదానికీ అతడ్ని రాచిరంపాన పెడుతుంది. ఏ దురవాట్లూ లేని అతడ్ని పైసాపైసా లెక్కలడుగుతుంది. అయిందానికీ కానిదానికీ విసుక్కుంటుంది ... వాళ్ళని చూసే వాళ్ళకెవరికైనా దాంపత్య జీవితం పట్ల విరక్తి కలుగుతుంది.

'హైదరాబాద్‌లోనే ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో విజయకుమార్ అనే సీనియర్ కొలీగ్ ఉంటాడు. అతనెప్పుడూ నవ్వుతూ - తుళ్ళుతూ ఉంటాడు. పైగా అతని భార్య ఎంప్లాయీ. అతని

అదృష్టానికి అందరూ అసూయపడేవాళ్ళు. అనుకోకుండా ఆ ఏరియాకెళ్ళినపుడు వాళ్ళింటికి వెళ్ళాడు.

'ఆ వాతావరణం తలుచుకుంటే చాలు ఎప్పుడైనా జుగుప్స కలుగుతుంది. ఆ భార్యామణి మెగుడ్ని పట్టుకుని 'ఒరేయ్' అనేదాకా మాట్లాడదు. పరాయి వాళ్ల ముందైనా పరువుగా మాట్లాడాలన్న ఇంగితం లేదావిడకు. తోటి ఉద్యోగి ముందు అవమానంగా ఫీలయ్యి అతను ఎదురు తిరిగాడు. కాస్త గట్టిగా అరిచాడు ... అంతే చెప్పు మొహం మీదికి విసిరికొట్టింది నిజంగానే.

'భార్యకూ, తల్లికీ మధ్యన నలిగి - నలిగీ మందుకలవాటు పట్టాడు మరో మిత్రుడు మదన్. తాగుడలవాటయ్యాక వాని పరిస్థితి మరీ ఘోరమయ్యింది. సైన్స్‌లో డాక్టరేట్ సాధించినవాడు ఏబిసిడీలు సరిగ్గా రాని పెళ్ళాం గర్జిస్తే తోక ఊపే పిల్లిలా, పెంపుడు కుక్కపిల్లలా మారిపోయాడు ...

'ఇటువంటి పరిస్థితులన్నీ తనలో ఆడవాళ్ళ పట్ల వివరీత భావాల్ని పెంపొందించాయేమో... ! మొత్తం మీద ఆడదాని అందం చూసి, ఉద్యోగం చూసి, కట్నం చూసి పెళ్ళి చేసుకోకూడదు. పెళ్ళాన్ని ఒక వ్యక్తిగా గాక వస్తువుగా మాత్రమే చూడాలి... అనే అభిప్రాయం బలపడిపోయింది. కాని -

'అనూషను చూస్తుంటే తన ఆలోచనలన్నీ మారిపోతున్నాయి. ఆమె వందకి రెండొందల శాతం మార్కులు కొట్టేస్తూంది ... అనూషా ... అనూషా ... అనూ ... నా అనూ ...' మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు అనిరుధ్.

హఠాత్తుగా అర్ధరాత్రి మెలకువ వచ్చింది అతనికి. లేచి కూర్చున్నాడు మంచం మీద. బయటి కెళ్దామంటే శరీరం బరువుగా, నిస్సత్తువగా అనిపించింది. అలాగే మళ్ళీ వాలిపోయాడు. తన గదికి దగ్గరలోనుండే ఏవో మాటలు వినిపిస్తున్నాయి. మరింత జాగ్రత్తగా విన్నాడు. ఒక గొంతు అనూషది. మరో గొంతు ... మగగొంతు. అది మామయ్యది కాదు.

"నువ్వు తప్పకుండా రావాలి ! అది నీకూ, మాకూ మంచిది !" అతని గొంతులో మార్దవం లేదు. అభ్యర్థన కంటే అధికారం ఎక్కువగా ధ్వనిస్తోంది.

"అది వీలుకాదని ఇంతకుముందే చెప్పాను. మళ్లీ ఇటువంటి ప్రస్తావన తెస్తే, ఈ

ఇంటి గుమ్మం తొక్కే అవకాశం ఉండదు". అనూష గొంతు కూడా దృఢంగా ఉంది.

"బెదిరిస్తున్నావా" ?

"మీరెలా అనుకున్నా నా కభ్యంతరంలేదు"

"మరి బడిలో పిల్లలకు నేర్పే విప్లవ గీతాలు ....?" నిలదీశాడతను.

"హు ! చైతన్యానికీ తీవ్రవాదానికీ తేడా మీకు తెలియకపోవడం నా తప్పు కాదు. చెడు ఎక్కడున్నా వ్యతిరేకించే సంస్కారం నాది. దేన్నైనా వ్యతిరేకించే దృష్టి మీది. సిద్ధాంత రీత్యా ఏసంస్థ అయినా గొప్పదే. కాని, దాన్ని అనుసరించే మీలాంటి అజ్ఞానం గలవాళ్ళ వల్లే సమస్యలు పుట్టుకొస్తాయి. మానవత్వం కొద్దీ ఇంతవరకూ మీకు నేనిచ్చిన సహకారం మీలో తప్పుడు ఆలోచనల్ని రేకెత్తిస్తుందని ఇప్పుడర్థమవుతున్నది. ఇకపై ఈ ఇంటిగడప తొక్కనవసరంలేదు".

"అనూషా ... బాగా ఆలోచించుకో. మాతో వస్తే స్వర్ణక్క కంటే ఎక్కువ గౌరవం పొందుతావు. నీ తెలివి, తెగువ ... పీడితులకు ఉపయోగపడ్తాయి...."అతని మాటలు పూర్తి కాలేదు.

"సారీ ! మీరు వెళ్ళొచ్చు. ఇంకెప్పుడూ ఇటువైపు రావద్దు. నాకూ కొన్ని సిద్ధాంతాలున్నాయి. మీకోసం వాటిని వదులుకోలేను ...."

"..." అతనేదో అనబోయాడు

"ప్లీజ్ ! గెట్‌లాస్ట్ ...." కఠినంగా అరిచింది అనూష.

అతను తనతో వచ్చిన వాళ్ళతో ఏదో గుసగుసలాడుతున్నట్టున్నాడు.

ఆ వచ్చినవాళ్ళు మావోయిస్టులని అర్థం చేసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు అనిరుధ్‌కి. ఎప్పుడూ పత్రికల్లో, టీ.వీల్లోనే గాని ప్రత్యక్షంగాచూసే అవకాశం కల్గలేదు. 'వాళ్ళని చూడాలి ... అనూష వ్యక్తిత్వాన్ని అభినందించాలి ...' అనుకుంటూ బలమంతా కూడగట్టుకొని లేచాడు. కాని, శరీరం పట్టు తప్పుతున్నట్టు స్పష్టాస్పష్టంగా తెలుస్తోంది ...

అనిరుధ్ గదిలో నుండి 'దబ్బు'మన్న శబ్దం విని రత్నాకరం, అనూషలు అక్కడికి పరిగెత్తారు.

మంచం పక్కనే అనిరుధ్ నేలమీద పడిపోయి ఉన్నాడు. సన్నగా మూలుగుతున్నాడు.

"బావా ... ! బావా ... !" భుజం పట్టి కుదిపింది అనూష.

బలవంతంగా ఏదో సమాధానమిస్తున్నట్టు పెదవులు కదిల్చాడు గానీ అర్థరహితమైన సన్నని శబ్దాలు మాత్రం వెలువడ్డాయి అతని నోటినుండి.

నుదుటి మీద చెయ్యివేసి, ఉలిక్కిపడింది అనూష. ఒళ్లు బాగా కాలిపోతూంది. ఆలస్యం చేయకుండా తండ్రీ కూతుళ్ళు అతన్ని మంచం మీదకు చేర్చారు. వెంటనే డాక్టర్ చంద్రారెడ్డిని తీసుకొచ్చేందుకు పరుగెత్తాడు రత్నాకరం.

* * *

సాయంత్రమే తిరిగివస్తానని బయల్దేరిన అనిరుధ్ నాలుగోరోజు గానీ బయల్దేరలేక పోయాడు. ఈ మూడు రోజులూ అనూష కంటికి రెప్పలా చూసుకుంది.

స్త్రీలపట్ల అనిరుధ్‌లో పేరుకు పోయిన విపరీత భావాలన్నీ కరిగిపోయాయి. అనూషలో ఓ 'ఆడది'గాక ఓ స్నేహితురాలు, ఓ శ్రమజీవి, ఓ ధీరవనిత, ఓ అమ్మా కనిపించింది. నిజంగా పెళ్ళి చేసుకుంటే అనూషను మించిన అమ్మాయి లేదు. ఇటువంటి భాగస్వామిని తోడుగా ఉంటే సుఖసంతోషాలే కాదు, విజయాలూ అలవోకగా సాధించవచ్చు. కష్టాలెన్నొచ్చినా హాయిగా భరించవచ్చు...'

'మనసులో మాట మామయ్యతో చెప్పాలా ? మరదలితో చెప్పాలా ?'అని మథనపడి, అనూషతో చెప్పడానికే నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్ తిరిగివెళ్తూ – "అనూ ! నువ్వంటే నాకిష్టం. మన పెళ్ళి నీకిష్టమేగా ?" అడిగాడు.

వెంటనే సమాధానం చెప్పలేదు అనూష.

అతని గుండె వేగం పెరిగింది. తన ప్రతిపాదనకు వెంటనే సమాధానం వస్తుందనుకున్న అతనిలో 'నెగెటివ్ ఆన్సర్ రాదు కదా !?' అనే అనుమానం క్షణక్షణానికీ పెరగసాగింది.

"బావా ! నువ్వంటే చిన్నప్పటి నుండి నాకభిమానమే. అత్తయ్యంటేప్రాణం ! చిన్నప్పటి నా ఆలోచనల సంగతి గుర్తులేదు కానీ, నేనెదుగుతున్నట్టే నా ఆలోచనల్లో మార్పొచ్చింది. మేనరికాల పట్ల నాకు అంత సదభిప్రాయం లేదు. చాలామందిని చూశాకే నేనీ నిర్ణయాని కొచ్చాను. పైగా మనది ఎదురు మేనరికం. కోరి కష్టాలు తెచ్చుకొని, భగవంతుడిపై భారం వేయడం నాకు నచ్చదు. నాన్న మొన్న హైదరాబాద్‌కి వచ్చినప్పుడే ఈ అభిప్రాయం చెప్పమన్నాను. తిరిగొచ్చిన నాన్న ఆ అవసరం లేదని తేల్చేశాడు. 'ఏది జరిగినా మన మంచికే' అని సరిపెట్టుకున్నాను.

"నాకంటె అందమైంది, చదువుకున్నదీ, నిన్ను ప్రేమిస్తూ, నీ కనుకూలంగానడుచుకునే అమ్మాయి నీ జీవిత భాగస్వామినిగా రావాలని మనసారా కోరుకుంటున్నాను. ఆల్ ద బెస్ట్!" పిడికిలి బిగించి బొటనవేలు పైకెత్తి, గాలిలో స్ట్రైస్ చేసింది అనూష.

❀❀❀

(జాగృతి, 5 సెప్టెంబర్ 2005)